క్లుప్తంగా

నెల్లిమర్ల ఎస్ఐకు ఎస్పీ ప్రశంస


ప్రశంసాపత్రం అందుకుంటున్న గణేష్

నెల్లిమర్ల: లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ కుదిర్చేందుకు కృషిచేసిన నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్‌ను ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం అభినందించారు. విజయనగరంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందజేశారు.

పరిహారం చెల్లించాలి..

విజయనగరం పూల్‌బాగ్: తుఫాన్ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొదటిసారి తుఫాన్‌కు కత్తెర తెగులు ఆశించి జిల్లా వ్యాప్తంగా వరి పంట నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చి కోతలు పూర్తయిన తర్వాత మూడోసారి తుఫాన్ వల్ల పంట పూర్తిగా నీట మునిగిపోయిందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

విజయభావన సదస్సు రేపు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 543వ సభను ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అనువాద సాహిత్యం – ఓ పరిశీలన' అనే విషయంపై విశాఖకు చెందిన ప్రసన్నభారతి కార్యదర్శి కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మానాపురం రాజాచంద్రశేఖర్ స్వీయకవితాపఠనం చేస్తారన్నారు. సాహితీ అభిమానులు సభకు హాజరుకావాలని కోరారు.

పుస్తకావిష్కరణ ..
ప్రముఖ రచయిత పాయల మురళీకృష్ణ రచించిన 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' పుస్తకాన్ని ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు గురజాడ స్వగృహంలో ఆవిష్కరించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా ప్రతినిధి చీకటి దివాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాదరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, డీఈఓ యు.మాణిక్యాలనాయుడు, రాచకిండం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.సన్యాసిరాజు హాజరవుతారన్నారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వితరణ


ఈఓకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందజేస్తున్న దాతలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన సత్రానికి దాతలు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను శుక్రవారం వితరణగా అందజేశారు. రామతీర్థం గ్రామానికి చెందిన ఖండవల్లి కిరణ్‌కుమార్, విజయనగరం పట్టణానికి చెందిన దాసరి శ్రీనివాసరావు 100 స్టీల్‌ప్లేట్లు, 100 గ్లాసులు చొప్పున ఈఓ శ్రీనివాసరావుకు అందించారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

వెహికల్ ఫ్రీజోన్ ఏర్పాటుపై పరిశీలన


ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు అంశాలను గమనించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ముందుగా ఎన్‌సీఎస్ రోడ్డు పరిసరాలను పరిశీలించి రహదారులపై చిరు వ్యాపారాలు చేయరాదని మందలించారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో వెహికల్ ఫ్రీ జోన్ ప్రాంతాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, డీఈఈ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, తదితరులతో ఆయా ప్రాంతాలను పరిశీలించి వెహికల్ ఫ్రీ జోన్ అంశమై సమాలోచనలు జరిపారు. అదే విధంగా అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకుని ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ట్యాంక్‌బండ్ రహదారిలో కాలువలో పూడికలు పేరుకుపోవడాన్ని గుర్తించి, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు పరిశుభ్రంగా ఉంచడమే ప్రధాన ధ్యేయంతో పని చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై..

నిరసన హోరు

- విజయనగరం, నెల్లిమర్ల, భోగాపురంలలో వైఎస్సార్‌సీపీ పోరుబాట
- ప్రజల గొంతుక వినిపించిన నేతలు
- చార్జీల పెంపుపై మండిపడిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- సర్‌చార్జీల బాదుడు వద్దంటూ విద్యుత్‌శాఖ అధికారులకు వినతి


విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత సీఎం చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక మాట మార్చి ప్రజలపై చార్జీల భారం మోపారని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మండిపడ్డారు. తక్షణమే విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దాసన్నపేట రింగ్ రోడ్డులోని కాళికామాత ఆలయం నుంచి విద్యుత్ భవనం వరకు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లవరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తేసిందన్నారు. ఆరునెలల్లో ఇంధన సర్దుబాటు పేరుతో రూ.1564 కోట్ల భారం వేసిందన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ ఏపీఈపీడీసీఎల్ ఈఈ (టెక్నికల్) మురళీకృష్ణకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి.రాజేష్, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఎస్.బంగారునాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యవతి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి


విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నెల్లిమర్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం అన్యాయమని, పెంచిన చార్జీలను తక్షణమే తగ్గించాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. మొయిద జంక్షన్ నుంచి విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. చార్జీల పెంపునకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా బెల్లాన మాట్లాడుతూ చార్జీల పెంపుతో వినియోగదారులపై పెనుభారం పడుతోందన్నారు. బిల్లులు చెల్లించలేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబల్ల శ్రీరాములనాయుడు, నెల్లిమర్ల పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే చార్జీలు పెంచడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. తగ్గించకుంటే ఆందోళన మరింత ఉద్ధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, పిన్నింటి తమ్మినాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణారావు, ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాయకులు రేవల్ల శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, మద్దిల వాసు, అట్టాడ శ్రీను, కనకల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాదుడు పాలన మాకొద్దు


విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఆ శాఖ డీఈకు వినతిపత్రం అందజేస్తున్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ఓ వైపు నిత్యావసర ధరల పెంపు.. మరోవైపు విద్యుత్ చార్జీల బాదుడుతో ఇబ్బందులు పెడుతున్న పాలన మాకొద్దంటూ జనం నినదించారు. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన పోరుబాటలో భాగస్వాములయ్యారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయం నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు జాతీయరహదారి మీదుగా విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కాసేపు ఆందోళన చేశారు. ఎస్సీఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం ఎత్తేయడంపై మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు మోసం ఫిక్స్ చేశారన్నారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలంటూ విద్యుత్‌శాఖ డీఈ కె.సత్యపరిపూర్ణ కుమార్‌కు భోగాపురం, పూసపాటిరేగ వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పతివాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, దంతులూరి రావాడబాబు, పడాల శ్రీనువాసురావు, పి.సూకరాజు, పట్నా తాతయ్యలు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, ఎ.పైడినాయుడు, పడాల భానుప్రకాష్, బయిరెడ్డి రమణ, తాడిశెట్టిబాబు, గుజ్జు సురేస్‌రెడ్డి, ఎర్ల రామకృష్ణ, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, శాంతాటి శ్రీనువాసురావు, తదితరులు పాల్గొన్నారు.


భోగాపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన

విద్యుత్ భారం మోపడం తగదు..

నెల్లిమర్ల రూరల్: వినియోగదారులపై విద్యుత్ భారాన్ని మోపడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. మండలంలోని కొండగుంపాంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంపద సృష్టిస్తానని చెప్పి ప్రజలను దోచుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యుత్ సర్దుబాటు చార్జీలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలిపల్లి సూరి, రమణమ్మ, తవిటినాయుడు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు


విజయనగరం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పూసపాటిరేగ: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు


గాజులరేగ నారాయణ స్కూల్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


రోటరీ దశగి పేర్రాజు స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అకాడమీలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయనగరం: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, తదితరులు నివాళులర్పించి, మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు అద్వితీయం
నెల్లిమర్ల: దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సేవలు అద్వితీయమని, ఆయన లేని లోటు దేశానికి తీర్చలేనిదని నెల్లిమర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గంటా సత్యనారాయణ(సతీష్) అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాయల సురేష్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మృతికి నివాళులు
విజయనగరం టౌన్: భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి జిల్లా వాసులు నివాళులర్పించారు. రోటరీ మ్యూజిక్ అకాడమీలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలేసి అంజలి ఘటించారు. ఆర్థికరంగంలో మంచి సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయుడని అకాడమీ ప్రిన్సిపాల్ రవి కొనియాడారు. కార్యక్రమలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మన్మోహన్ సింగ్ మృతికి సంతాపసభ నిర్వహించారు. దేశం ఆర్థిక, సాంకేతిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించడానికి మన్మోహన్ సింగ్ ఎంతగానో కృషిచేశారని పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ విడుదల చేసిన ప్రకటనలో మన్మోహన్ సింగ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

నివాళి..
విజయనగరం అర్బన్: మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల మాజీ ఎంపీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ లోక్‌సభ సభ్యుడిగా తాను ఉన్నప్పుడు లైబ్రరీలో మన్మోహన్ సింగ్‌తో పరిచయం ఏర్పడిందని పేర్కొన్నారు. నిత్యం ప్రజాసేవ కోసం పరితపించే అటువంటి వ్యక్తి మృతి దేశానికే తీరని లోటన్నారు.

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి..
పూసపాటిరేగ: భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అని వైఎస్సార్‌సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోమోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పూసపాటిరేగ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ శివారెడ్డి, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, దంతులూరి రావాడబాబు, పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి


- యూటీఎఫ్ జిల్లా కమిటీ పిలుపు

విజయనగరం అర్బన్: యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోట జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివసరావు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మాట్లాడుతూ.. రాజాం, తెర్లాం, మెరకముడిదాం, గరివిడి, నెల్లిమర్ల ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో మహాసభలపై అవగాహన కల్పించామన్నారు. సభలో విద్యారంగంలోని సంస్కరణలపై విశ్లేషించనున్నట్లు చెప్పారు. ప్రచార యాత్రలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె. విజయగౌరి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జేఆర్‌సీ పట్నాయక్, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కోశాధికారి భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సత్యనారాయణ, శంకరరావు, విజయనగరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకటరావు, పి.రామకృష్ణ, గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లించేందుకు అవకాశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న అర్ధ సంవత్సరం పన్ను బకాయిలను చెల్లించి అదనపు వడ్డీ నుంచి మినహాయింపు పొందాలని ఆస్తిపన్నుదారులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నలనయ్య ఒక ప్రకటనలో కోరారు. అర్ధ సంవత్సరంలో మిగిలి ఉన్న పన్నులను ఈ నెల 31లోగా చెల్లించాలని పేర్కొన్నారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని.. అయినప్పటికీ స్పందించని వారి పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అలాగే కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న కొన్ని దుకాణాలకు సంబంధించి వ్యాపారులు అద్దె బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించలేదని.. అటువంటి దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

● ఎక్కడి కుప్పలు అక్కడే..



గడిచిన వారం రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో వరి కుప్పలు ఎక్కడికక్కడే ఉండిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతన్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికి అందినట్టు అంది తుఫాన్ తాకిడికి పాడైందని వాపోతున్నారు. ఎండ కాస్తే నూర్పులు చేపట్టడానికి అన్నదాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
– విజయనగరం రూరల్

రహదారి పనులు పునఃప్రారంభమయ్యేనా..?


గత ప్రభుత్వంలో నెల్లిమర్ల-సతివాడ రహదారిలో రహదారి విస్తరణ పనులు (ఫైల్)


రామతీర్థం వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గోతులు

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో సతివాడ, నెల్లిమర్ల వరకు రహదారి విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో చురుకుగా కొనసాగిన విస్తరణ పనులు ప్రభుత్వం మారిన అనంతరం పడకేసాయి. సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించడానికి గత ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో సుమారు 8 మినీ కల్వర్టుల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. తర్వాత జరిగిన పరిణామాలతో ప్రభుత్వం మారింది. దీంతో విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి. గతంలో నిర్మించిన కల్వర్టుల వద్ద ఏర్పడిన గోతులతో ప్రస్తుతం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం ఆ మార్గంలో వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి చిన్నది కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడడమే కాకుండా తరుచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాస్తవానికి 2016లోనే రహదారిని స్టేట్ హైవేగా ఆర్‌అండ్‌బీ అధికారులు అప్‌గ్రేడ్ చేసినప్పటికీ.. రహదారి విస్తరణకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దష్టిని కేంద్రీకరించి నిధులు మంజూరు చేసి చిత్తశుద్ధిని చాటుకుంది. పనులు కూడా ప్రారంభమై వేగంగా సాగడంతో ప్రయాణికులు ఎంతో సంతోషించారు. ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చిందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రహదారి విస్తరణ పనులు పునః ప్రారంభించాలని కోరుతున్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తం


టీబీ వ్యాధి నిర్మూలనపై సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి వసుంధర

పూసపాటిరేగ : క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ నివారణ ప్రత్యేక అధికారి డాక్టర్ వసుంధర అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆయాసం, దగ్గు, రక్తంపడడం, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే టీబీగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ మందులు వాడుతున్న సమయంలో నెలకు 1000 రుపాయలు చొప్పున రోగి బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. అనంతరం కోనాడ గ్రామాన్ని సందర్శించి టీబీ 100 రోజులు కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంటు బంగారుబాబు, ఎంఎల్‌హెచ్‌పీ పూర్ణిమ, ఏఎన్‌ఎం బంగారమ్మ, కార్యదర్శి భూషణ్, తదితరులు పాల్గొన్నారు.